క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



చంద్రగుప్తాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

దెందులూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాలగూడెం గ్రామానికి చెందిన పత్యాల చంద్రగుప్తాను బుధవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు జానంపేట బాబు, తేరా ఆనంద్, రఘు, ప్రభుదేవ, సునీత ఉన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి పరామర్శ



మణికంఠ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో బుధవారం గుండెపోటుతో మృతి చెందిన జర్నలిస్ట్ ఎస్ మణికంఠ మృతదేహంపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ గుడిపూడి రఘు, జర్నలిస్ట్ సంఘం నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నిర్మాణం నిలుపుదలకు నోటీసు



పోరంబోకు భూమిలో చేపట్టిన నిర్మాణం

దెందులూరు: మండలంలోని దోసపాడు గ్రామ పంచాయతీ పరిధిలో దోసపాడు వంతెన వద్ద చెరువు పోరంబోకు భూమిలో అక్రమ నిర్మాణంపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారని గ్రామకార్యదర్శి ఆదిలక్ష్మి తెలిపారు. పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన మేడూరి వెంకటేశ్వరరావుకు పనులు నిలుపుదల చేయాలని నోటీసులు జారీ చేశామని, స్థల వివాదం కోర్టులో ఉన్నట్టు తెలిసిందని పేర్కొన్నారు. ఈ విషయంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

రామ మందిర నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న రామాంజనేయులు, కరుణ ప్రియ దంపతులు

దెందులూరు: గోపన్నపాలెం కోదండ సీతారామస్వామి ఆలయంలో సాకేతర రామ మందిర నిర్మాణానికి ఏనుగు వెంకటేశ్వరరావు, లక్ష్మి దంపతుల చిన్న కుమారుడు ఏనుగు రామాంజనేయులు, కరుణ ప్రియ దంపతులు రూ.1,11,116 విరాళం అందజేశారు. దాతకు కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనల అమలు తప్పనిసరి



పినకడిమిలో మాట్లాడుతున్న తహసీల్దార్

పెదవేగి : ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ శ్రీనివాసకుమార్ అన్నారు. పెదవేగి మండలం పినకడిమి సచివాలయం వద్ద రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో ఎన్నికల నియమ నిబంధనలపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. రోడ్లపై నలుగురు లేక ఐదుగురికి మించి ఉండకూడదన్నారు. వాహనాలపై స్టిక్కర్లు, ఇళ్లపై రాజకీయ జెండాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యప్రభ, ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఈటీల సమావేశం

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం ఎస్‌సీఈఆర్‌టీ సమావేశం ఏర్పాటుచేసినట్టు డీఈఓ అబ్రహాం తెలిపారు. ఏలూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు, ద్వారకాతిరుమల, భీమడోలు, గణపవరం, ఉంగుటూరు, నిడమర్రు మండలాల పీఈటీలు విధిగా హాజరుకావాలన్నారు.

హామీల అమలులో జగన్ ఆదర్శం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: ఎన్నికల హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో అమలు చేసి ఆదర్శ పాలన అందించారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన భీమడోలు పంచాయతీ శివారు సాధుగారి దిబ్బ, చినలింగంపాడు, పెద్దలింగంపాడు గ్రామాల్లో మన ఊరికి మన వాసన్న.. మంచి చేశాడు మళ్లీ చేస్తాడు అనే నినాదంతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకే ఓట్టేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి గ్యారంటీ స్కీమ్‌ల పేరు చెప్పి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని, వారిని నమ్మవద్దని సూచించారు. ప్రజలంతా వారి ఉచ్చులో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. చంద్రబాబు అండ్ కో 2014 ఎన్నికల్లో హామీల వర్షం కురిపించి ఐదేళ్లలో ఒక్క హామీని నెరవేర్చలేదన్న విషయాన్ని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలో పడిన కష్టాలు ప్రజలకు వివరించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మామిళ్లపల్లి జయప్రకాష్, సర్పంచ్ పాము సునీత, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి వగ్వాల అచ్యుత రామారావు, పార్టీ రాష్ట్ర నేత నౌడు వెంకట రమణ, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఆర్‌బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, సీహెచ్‌సీ చైర్మన్ చింతా రాము, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు ఆల్తి గోపి, ఇంజేటి జూనియర్, ఆజామ్, గంటా శ్రీనివాసరావు, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, నియోజకవర్గ లీగల్‌సెల్ కన్వీనర్ ఆల్తి శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా జాయింట్ కార్యదర్శి అంబటి నాగేంద్ర ప్రసాద్, నాయకులు చిలపర్తి రామారాయుడు, మరడాని భవానీరావు, పాకిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో వాసుబాబుకు హారతి పడుతున్న మహిళ



లింగంపాడులో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నవరత్న పథకాలతో ప్రజలకు మేలు

పెదపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు ద్వారా ఒక్కో లబ్ధిదారు కుటుంబానికీ రూ.1 లక్ష నుంచి రూ.8 లక్షల వరకు లబ్ధి చేకూర్చారని మండల సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపీచంద్ర దుర్గాప్రసాద్, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ అన్నారు. పెదపాడు మండలం పునుకొల్లు గ్రామంలో బుధవారం నేను సిద్ధం మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాను గుర్తుపై ఓటేసి, జగనన్నను మరోసారి సీఎంను చేసుకోవాలని కోరారు. మహిళలకు చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కంభంపాటి సుబ్రహ్మణ్యం, కంభంపాటి సుబ్బయ్య, వీరంకి సుబ్బారావు (గువ్వ), పొలిమెట్ల రమేష్, పొలిమెట్ల నాని, తటకులూరి పండుబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా భావించి పాలన సాగిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏఎంసీ చైర్మన్, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలం అప్పనవీడులో నిర్వహించిన నేను సిద్ధం మా ఊరు సిద్ధం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌ను అమలు చేసిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, ఎంపీటీసీ బుద్దే రామసీత, గ్రామ సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపిద్దాం

ఉంగుటూరు: ఫ్యాను గుర్తుపై ఓట్లేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పుప్పాల వాసుబాబు, సునీల్‌కుమార్‌లను గెలిపించుకోవాలని ఆ పార్టీ నాయకులు కోరారు. బుధవారం ఉంగుటూరులో నాయకులతో కలిసి ఎమ్మెల్యే సోదరుడు పుప్పాల చిన్నబాబు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, మహిళా నాయకురాలు మంద జయలక్ష్మి, ముస్లిం విభాగం నాయకులు సయ్యద్ బాజి, నాయకులు బావన సూరిబాబు, దూసనపూడి లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, తాడి రామారావు, తాడి వెంకటేశ్వరరావు, పత్తిపాటి దుర్గం, కొల్లి నాగు, తల్లాప్రగడ శివరామకృష్ణ, కాళ్ల శివాజీ, కాలిమంగన్న పాల్గొన్నారు.



పెదపాడు : పునుకొల్లు గ్రామంలో ప్రచారం చేస్తున్న గోపీచంద్ర దుర్గాప్రసాద్, రాజశేఖర్



పెదపాడు : అప్పనవీడులో నాయకుల ప్రచారం



ఉంగుటూరు : ఇంటింటా ప్రచారం చేస్తున్న పుప్పాల చిన్నబాబు

పిల్లల భవిష్యత్తుపై శ్రద్ధ తీసుకోండి



తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

భీమడోలు: పిల్లల భవిష్యత్తు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ట్రైనీ డీఎస్పీ బి.విద్య సూచించారు. పదో తరగతి పరీక్షలు ముగిసిన నేపథ్యంలో ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు బుధవారం వేసవి సెలవుల్లో మైనర్ల బైక్ డ్రైవింగ్, అతివేగం, ప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్య ఆధ్వర్యంలో సీఐ బీబీ రవికుమార్ నేతృత్వంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. లైసెన్సులు లేకుండా బైక్ నడిపే పలువురు మైనర్ల నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నారు. భీమడోలు పోలీస్ స్టేషన్‌లో మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. డీఎస్పీ విద్య మాట్లాడుతూ పరీక్షలు ముగిసినందున తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల్లో మైనర్లు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొని భవిష్యత్తును నాశనం చేసుకోకుండా తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ లైసెన్స్ పొందాలని సూచించారు. సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ ఏటా సెలవుల్లో మైనర్లు బైక్‌లు నడిపి ప్రాణాలు కోల్పోవడం, ఇతరుల ప్రాణాలు పోగొట్టడం, క్షతగాత్రులు కావడం వంటి ఘటనల నేపథ్యంలో తల్లిదండ్రులను మేల్కొల్పేందుకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ఎస్సై వై.సుధాకర్, పోలీస్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు చిలకంపాడులో వాసుబాబు ప్రచారం

గణపవరం: చిలకంపాడులో గురువారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మన ఊరు – మన వాసన్న కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేకమవుతారు. ఐదేళ్ల పాలనలో గ్రామంలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆయన ఇంటింటా ప్రచారం చేస్తారని, పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని పార్టీ మండల అధ్యక్షుడు దండు రాము కోరారు.

పరీక్షలు ముగిసిన వేళ.. ఆనంద హేల

భీమడోలు: టెన్త్ పరీక్షలు ముగిసిన వేళ... విద్యార్థులు ఆనందడోలికల్లో మునిగి తేలారు. పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఎండను సైతం లెక్క చేయకుండా వారంతా కేరింతలు కొట్టారు. ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు సోషల్ పరీక్ష నిర్వహించారు. ఒక్క మాస్ కాపీయింగ్ కేసు నమోదు కాకుండా పగడ్బందీగా ప్రభుత్వం పరీక్షలు నిర్వహించింది. మండల వ్యాప్తంగా భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక, పోలసానిపల్లి గురుకులాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 1133 మంది పరీక్షలు రాశారు. భీమడోలు, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. పోలసానిపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులను ఆర్టీసీ బస్సుల్లో తీసుకెళ్లి తీసుకొచ్చారు. చివరి గంట మోగగానే పరీక్షా హాల్ నుంచి బయటకొస్తూనే విద్యార్థులంతా ఆనందంతో కేరింతలు కొట్టారు. తమ బంగారు భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకుంటూ చెట్ల వద్దే కూర్చుండిపోయారు. ఎక్కడ ఉన్నా మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఒకరినొకరు ఆకాంక్షించుకున్నారు. పరీక్షలు బాగా రాయడంతో వారంతా ఆనందాన్ని వ్యక్తం చేశారు.



భీమడోలు పరీక్షా కేంద్రం నుంచి బయటకొస్తున్న విద్యార్థులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వెంకటేష్ మృతదేహం

దెందులూరు: కుటుంబ కలహాల కారణంగా కొంగల మందు తిని చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై కె.స్వామి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేలేరుపాడు మండలం శివకాశీపురం గ్రామానికి చెందిన పొట్ల వెంకటేష్ (33) పోతునూరు చేపల చెరువు వద్ద కాపలాగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కొంగల మందు తిన్నాడు. స్థానికులు అతన్ని ఏలూరు వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



సత్యవోలులో శివలింగాన్ని ప్రతిష్ఠిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు



రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

పెదపాడు : పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో దాతల సహకారంతో గంగా పార్వతీ సమేత శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు ఆలయంలోని యంత్ర, విగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కళాన్యాసం, కుంభాన్న దర్శనం, దృష్టిగోవు దర్శనం, భక్తులకు శివమూర్తి తొలి దర్శనం యాగశాలలో మహా పూర్ణాహుతి, అగ్ని ప్రదక్షణం, ఆచార్య బహుమతి, అగ్రిభస్మధారణ, శిఖర కుంభాభిషేకం, స్వామివార్ల శాంతికల్యాణం యజమానుల దీక్షా విమోకం, అవబృంధం, నూతన వస్త్రధారణం, ఆశీర్వాచకం నిర్వహించారు. యాగాధ్వర్యులు యలమంచిలి కృష్ణ మూర్తి వివాచార్య, యలమంచిలి ప్రసాదశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 11 గంటలకు భారీ అన్న సమారాధన దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు బొమ్మి ప్రభాకరరావు, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, టంగుడు ఆంజనేయులు, కొట్నాన వెంకట్రావు, గండివలస బాలకృష్ణ, గండివలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

దెందులూరు: అన్నిరాజకీయ పార్టీలు భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనలు పాటించాలని, గౌరవించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బి.లావణ్యవేణి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. నిబంధనలు వివరించారు. రోజువారి రిజిష్టర్లు సరైన పద్ధతిలో నిర్వహించాలన్నారు. రిజిష్టర్లు, ఓచర్లు ప్రతి మూడు రోజులకోసారి తనిఖీ చేయించుకోవాలని, పర్మిషన్లు సరైన పద్ధతిలో పొందాలని, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని వివరించారు. నామినేషన్ల నుంచి ఫలితాలు ప్రకటించే తేదీ వరకు అయిన ఖర్చులు అభ్యర్థికి వర్తిస్తాయన్నారు. నామినేషన్‌కు ముందు అయిన ఖర్చు పార్టీ పేరున నమోదవుతాయన్నారు. ఫలితాలు ప్రకటించిన రోజున అన్ని రిజిష్టర్లు, ఓచర్లు, బిల్లులు, కార్యాలయానికి సమర్పించాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ వి.జితేంద్ర, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న జేసీ, ఆర్‌ఓ లావణ్య వేణి



పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ లక్ష్మయ్య

దెందులూరు : ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని, శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఎస్పీ జి.లక్ష్మయ్య అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. సీఐ కె.శ్రీనివాస్, ఎస్సైలు శుభశేఖర్, రాజేంద్రప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు హమీద్, గోపి, సిబ్బంది, గ్రామస్తులున్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామ పంచాయతీల్లోని పేదలకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. చొదిమెళ్ల, కొమడవోలు, శనివారపుపేట, పోణంగి గ్రామాల పేదలు పాల్గొన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సీఐటీయూ నాయకులు పి.కిషోర్ మాట్లాడారు.

మళ్లీ జగన్ ప్రభంజనం ఖాయం

ద్వారకాతిరుమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభ ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోందని వైఎస్సార్ సీపీ ఎన్నారై, ఐటీ విభాగం రాష్ట్ర నాయకుడు పసుపులేటి వీరభద్రరావు (బద్రి) అన్నారు. శ్రీవారి క్షేత్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్నకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. జగనన్న బస్సు యాత్రతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు కంటిమీద కునుకు ఉండదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ ప్రభంజనాన్ని సృష్టించడం ఖాయమని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిధున్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్టు చెప్పారు. గోదావరి జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో జగనన్న ప్రచారాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు.

కొల్లేరు ప్రజలకు భరోసా

- ముంపు సమస్యకు పరిష్కారం
- రూ.8.48 కోట్లతో ఏడు లేఅవుట్ల మెరక
- సుమారు 4,500 మందికి మేలు



మొండికోడులో మెరక చేసిన జగనన్నకాలనీ

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల్లో ఏటా వర్షాకాలంలో ముంపు భయం.. పాములు, పురుగుల మధ్య జనజీవనం.. కనీస సదుపాయాలు కరువు.. పట్టించుకోని గత ప్రభుత్వాలు.. ప్రజలను చుట్టుముట్టే సమస్యలు ఇదంతా గతం. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత చేపట్టిన మెరక పనుల కారణంగా కొల్లేరు ప్రజలను భయం వీడింది. వారిలో ధైర్యం నెలకొంది. ఏలూరు రూరల్ మండలం, దెందులూరు నియోజకవర్గ గ్రామాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న కాలనీల మెరక పనులకు రెండు విడతల్లో ప్రభుత్వం రూ.8.48 కోట్లు ఖర్చు చేసింది. మొత్తంగా 15 గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఏర్పాటుచేసిన ఏడు లేఅవుట్లను మెరక చేశారు. దీంతో సుమారు 4,500 మందికి మేలు జరిగింది. వరదల సమయంలో సైతం కాలనీలు నీట మునగకుండా అడ్డుకట్ట పడింది. వర్షాకాలంలో మురుగునీరు బయటకు పోయేందుకు మార్గం ఏర్పడింది. మెరక పనుల కారణంగా ఒక్కో లబ్ధిదారుడికీ రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరక పనులు ఇలా..





మెరక చేసిన చాటపర్రు జగనన్నకాలనీలో పేదలు నిర్మిస్తున్న ఇళ్లు

పనుల పర్యవేక్షణ బాధ్యతను ప్రభుత్వం హౌసింగ్ బోర్డుకు అప్పగించింది. పనుల నాణ్యత, నిర్ణీత సమయంలో మండల స్థాయిలో ఎంపీడీఓ, తహసీల్దార్, హౌసింగ్ ఏఈతో పాటు సర్పంచ్, కార్యదర్శి సభ్యులుగా కమిటీలను నియమించి పూర్తి చేయించింది. గుడివాకలంకలో 5.24 ఎకరాల భూమిని రూ.1.06 కోట్లతో మెరక చేశారు. కోమటిలంకలో 1.03 సెంట్ల భూమిలో రూ.26.72 లక్షలతో, 3.22 ఎకరాల గురుకులపేట జగనన్నకాలనీని రూ.47.60 లక్షలతో మెరక చేయించారు. మాదేపల్లిలో 20.77 ఎకరాల భూమిని రూ.2.67 కోట్లతో, మానూరులో 1.86 సెంట్ల కాలనీని రూ.47.30 లక్షలతో, శ్రీపర్రులో 10.86 ఎకరాలను రూ.2.03 కోట్లతో, జాలిపూడిలో 2.95 ఎకరాలను రూ.46.91 లక్షలతో, పైడిచింతపాడులో సుమారు రూ.40 లక్షలతో, ప్రత్తికోళ్లలంకలో 2.37 ఎకరాలను రూ.61.50 లక్షలతో మెరక చేయించారు.

ఎమ్మెల్యే కృషితో పరిష్కారం



కొల్లేరు గ్రామాల ముంపు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శ్రద్ధ వహించారు. భవిష్యత్తులో ముంపుబారిన పడకుండా మెరక పనుల కోసం ప్రభుత్వానికి నివేదించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు. తొలివిడత పనులకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో ఎమ్మెల్యే వారిని ఒప్పించి పనులు పూర్తి చేయించారు. ఎమ్మెల్యే కృషి వల్లే జగనన్నకాలనీలో ముంపు భయం పోయింది.

– గుడిపూడి రఘు, చాటపర్రు సర్పంచ్

మేలు జరిగింది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల నాకు ఇల్లు వచ్చింది. ప్రభుత్వమే మెరక పనులు చేయడం వల్ల నాలాంటి పేదలకు మేలు జరిగింది. లేదంటే ఏటా వచ్చే వర్షాలు, వరదలకు మూటముళ్లు సర్దుకుని ఒడ్డుకు పోవాల్సిందే. ఇప్పుడు ఆ దుస్థితి ఉండదు. మేమే మెరక చేసుకోలంటే రూ.1 లక్ష ఖర్చు అవుతుంది. ఈ డబ్బు ఇంటి నిర్మాణంలో ఖర్చు చేసుకున్నాం. జగనన్న కాలనీలు ఏర్పాటుచేసి మా లాంటి పేదలకు జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారు.

– సీహెచ్ రంగమ్మ, కోటేశ్వరదుర్గాపురం

యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా సాయికుమార్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు పలువురు నేతలకు పార్టీ పదవులు కేటాయిస్తూ ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు నగర యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా మునిశెట్టి సాయికుమార్, పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులుగా పేటేటి చిట్టిబాబు, బంకురు వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా పోతునూరి తాతారావు, జొన్నలగడ్డ రాజ్‌కుమార్, కొండేటి పోతురాజులను నియమించారు.

వృద్ధుడు మృతి

పెదవేగి : విజయరాయి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందినట్టు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. విజయరాయికి చెందిన ఉయ్యాల వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై బలివే వెళ్లి తిరిగి విజయరాయి వస్తుండగా వెనుక నుంచి విజయరాయివైపు వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్వరరావు (68) అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వరరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.